సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 1 | జూన్ | 2025



అలా స్పాగిపోతున్నారు..!

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నయా సంస్కృతి మొదలైంది. ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు వంటి కాస్మోపాలిటిన్ నగరాల్లో ఉండే స్పా సెంటర్ల కల్చర్ ఇక్కడకు విస్తరించింది.


8లో



యోరక్కపోయారుగా..

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యోగాంధ్ర హంగామా ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రజలను భాగస్వాముల్ని చేసేందుకు వారు ఆపసోపాలు పడుతున్నారు.

కడలిలోకి 10,678 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 10,678 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కూటమి పాలనలో విలేకరులపై పెరిగిన దాడులు



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు తదితరులు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో విలేకర్లపై దాడులు పెరిగిపోయాయని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అయినవిల్లి మండల సాక్షి విలేకరి బావిశెట్టి నాగేశ్వరరావుపై అయినవిల్లిలో శుక్రవారం రాత్రి ఇద్దరు యువకులు ముసుగులు ధరించి హత్యాయత్నానికి పాల్పడటం దారుణమని అన్నారు. అమలాపురంలో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వరావును ఆయన శనివారం పరామర్శించారు. దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాక్షి విలేకరిపై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాగేశ్వరరావును వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నవరం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, విఘ్నేశ్వరస్వామి ఆలయం మాజీ చైర్మన్ గుత్తుల నాగబాబు, నాయకులు సలాది బుచ్చిరాజు, మద్దాల చంటిబాబు, గుర్రాల రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, కొప్పనాతి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పరామర్శించారు.

కూటమి ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి



వైఎస్సార్ సీపీ నేతలతో కలసి 'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి

ఆలమూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సక్రమంగా అమలు చేయకుండా పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. చెముడులంకలోని పార్టీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ప్రజలకు ఒరిగింది శూన్యమన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల మన్ననలను పొందిన రేషన్ డోర్ డెలివరీ పథకాన్ని రద్దు చేసి, ఎండీయూ ఆపరేటర్లను రోడ్డున పడేశారన్నారు. విద్యుత్ బిల్లులు నాలుగింతలు పెంచేచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ ఒక రేషన్‌కార్డు కానీ, పింఛన్ కానీ మంజూరు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతను తెలియజేస్తోందన్నారు. అందుకే వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు చాటి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్‌ను విజయలక్ష్మి ఆవిష్కరించారు. పార్లమెంటరీ పార్టీ పరిశీలకురాలిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి మండలానికి విచ్చేసిన ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, మాజీ ఏజీపీ నామాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిల కోసంరేపు ధర్నా

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకం వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.శివ, దైవవాణి తెలిపారు. అమలాపురం మండలం కామనగరువు పరిధిలోని కరక్కాయపేటలో శనివారం వారు ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు గతంలో అనేక సదుపాయాలు కల్పించేవారని, టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ ఇచ్చేవారని, మేట్లకు రూ.5 ప్రోత్సాహం ఇచ్చేవారని చెప్పారు. గతంలో ఒక్క పూట మాత్రమే పని చేయించేవారని, కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక సదుపాయాలన్నీ రద్దు చేశారని, రెండు పూటలా మస్తరు వేయాలనే నిబంధన పెట్టారని చెప్పారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసి, ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉపాధి కూలాలకు జిల్లాలో రూ.55 కోట్లు పైగా వేతన బకాయిలున్నాయని చెప్పారు. కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

చతికిల బడి



నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల

- ప్రభుత్వ బడుల్లో అపూర్వ మార్పులకు గత సీఎం జగన్ పునాది
- 'అమ్మ ఒడి'తో పేద విద్యార్థులకు భరోసా
- 'నాడు-నేడు'తో రూపు మారిన పాఠశాలలు
- డిజిటల్ విద్యకు శ్రీకారం
- నేడు పట్టాలు తప్పిన విద్యారంగం

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ బడుల్లో మునుపెన్నడూ చూడని విప్లవాత్మక మార్పులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాంది పలికింది. పేదల ఇంట విద్యా దీపాలు వెలిగించిన సువర్ణాధ్యాయమది. చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే మహా సంకల్పంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ బడుల్లో సరికొత్త ఒరవడి తీసుకు వచ్చారు. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. 'అమ్మ ఒడి' పథకం పేరును 'తల్లికి వందనం'గా మార్చారు. కానీ, విద్యార్థుల తల్లుల ఖాతాలో నయాపైసా కూడా జమ చేయకుండా వారి ఆశలపై చంద్రబాబు నీళ్లు జల్లారు. పేదలపై ఫీజుల భారం మోపుతున్నారు. పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చిన నాడు-నేడు పథకం ప్రగతి నత్తనడకన సాగుతోంది.

కోనసీమ నుంచే 'నాడు-నేడు'

శిథిల స్థితిలో ఉండి, వెలవెలబోయిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మన బడి నాడు-నేడు పథకం ద్వారా సమూలంగా మార్చారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణం, విద్యుదీకరణ, తాగునీరు, ఫర్నిచర్, కిచెన్ షెడ్లు, మేజర్, మైనర్ మరమ్మతులు, పెయింటింగ్స్ తదితర పనులను ఈ పథకంలో చేపట్టారు. నాడు-నేడు మొదటి విడతలో జిల్లాలో 279, రెండో విడతలో 763 పాఠశాలలను అభివృద్ధి చేశారు. నాడు-నేడు మొదటి విడత పథకాన్ని 2021 ఆగస్టు 16న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభించారు. అదే వేదికపై నాడు-నేడు రెండో దశను ప్రారంభించి, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.

విద్యార్థుల ఇబ్బందులు పట్టవా..



ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.3,840 కోట్ల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉంది. ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. ఈ ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టడం లేదు.

– బి.సిద్ధు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీడీఎస్‌యూ

రెండో ఏడాది వచ్చినా..



మాది చాలా పేద కుటుంబం. నాకు ఇద్దరు అబ్బాయిలున్నారు. పెద బాబు 9వ తరగతి, చిన్నబ్బాయి 7వ తరగతికి వచ్చారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ అమ్మ ఒడి ఇస్తామన్నారు. రెండో ఏడాది వచ్చినా ఇవ్వలేదు.

– గంటా అరుణకుమారి, గొల్లపాలెం, మలికిపురం మండలం

ప్రతి విద్యార్థీ చదువుకోవాలనే లక్ష్యంతో..

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటానికి ముందు ఆర్థిక ఇబ్బందులతో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించేవారు కాదు. ఎవరైనా పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. దీనిని గుర్తించిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. పిల్లల చదువులకు పేదలు ఇబ్బంది పడరాదనే ఉద్దేశంతో 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఏటా తల్లుల ఖాతాలో రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. 2019-20లో 1,70,994 మందికి రూ.206.991 కోట్లు, 2020-21లో 1,44,797 మందికి రూ.217.196 కోట్లు, 2021-22లో 1,45,462 మందికి రూ.218.193 కోట్లు, 2022-23లో === మందికి రూ. === కోట్లు జమ చేశారు.

గడచిన విద్యా సంవత్సరంలో దాదాపు 1.45 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున సుమారు రూ.217.50 కోట్లు జమ చేయాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా తల్లికి వందనం కింద చదువుకునే ప్రతి విద్యార్థికీ ఇస్తామన్న రూ.20 వేలు కూడా ఇవ్వలేదు.

రుచిగా మధ్యాహ్న భోజనం

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ధ్యేయంగా మధ్యాహ్న భోజన పథకంలో మెనూలో కూడా జగన్ ప్రభుత్వం వినూత్న మార్పులు తీసుకువచ్చింది. రోజుకో మెనూ ప్రవేశపెట్టారు. జగనన్న గోరుముద్ద పేరిట పోషక విలువలతో కూడిన ఆహారం అందించింది. వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, రోజు విడిచి రోజు చిక్కీ, రాగిజావ అందించారు. దీంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు కూడా సమకూర్చారు. ఈ పథకం పేరును కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్చింది. నేడు ఈ పథకం మెనూ అమలులో నాణ్యత లోపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉన్నత విద్యకు పెద్దపీట

పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే ఉన్నత చదువులు మానేయకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలను ప్రవేశపెట్టింది. పాలిటెక్నిక్, డిగ్రీ, ఎంబీబీఎస్, బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంబీఏ, ఎం.ఫార్మసీ తదితర ఉన్నత కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ (జగనన్న విద్యా దీవెన) అందించారు. ప్రతి విద్యా సంవత్సరంలో ప్రతి త్రైమాసికానికి సంబంధించిన కళాశాల ఫీజులను ఆ త్రైమాసికంలోనే తల్లుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలో ఏటా సుమారు 29 వేల మందికి లబ్ధి చేకూరేలా 26 వేల మంది తల్లుల ఖాతాల్లో సుమారు రూ.22 కోట్ల చొప్పున జమ చేశారు. నేడు కూటమి ప్రభుత్వం సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.



కూటమి పాలనలో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల భవన నిర్మాణం

నేడు తిరోగమనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే విద్యారంగం తిరోగమనంలో సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చదువుకునే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అమలు చేస్తామని గత ఎన్నికల్లో చెప్పిన కూటమి పెద్దలు నేటి వరకూ ఆ పథకాన్ని అమలు చేయలేదు. నాడు-నేడు పథకాన్ని మన బడి-మన భవిష్యత్తుగా మార్చారు. ఈ పథకం రెండో దశలో జిల్లావ్యాప్తంగా 761 పాఠశాలలను అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికి రూ.249 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా, రివాల్వింగ్ ఫండ్‌గా రూ.86 కోట్లు, సెంట్రల్లీ ప్రొక్యూర్డ్ మెటీరియల్(సీపీఎం)కు రూ.61 కోట్లు కలిపి రూ.147 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా రివాల్వింగ్ ఫండ్, సీపీఎం రూపేణా రూ.102 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. 267 అదనపు తరగతి గదులకు 223 పనులు వివిధ దశల్లో ఉండగా, 25 అదనపు తరగతి గదులు ప్రారంభించలేదు. 19 అదనపు తరగతి గదులు పూర్తయ్యాయి. అధిక సంఖ్యలో పాఠశాలలకు సిమెంట్ రావాల్సి ఉంది. కొత్తగా 546 టాయిలెట్లు నిర్మిస్తుండగా 267 పూర్తి చేయగా 278 వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే 403 కిచెన్ షెడ్లు మంజూరవగా, 167 పూర్తయ్యాయి. 235 వివిధ దశల్లో ఉన్నాయి. మేజర్, మైనర్ మరమ్మతులకు 1,012 పనులు మంజూరవగా, 576 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 548 పాఠశాలల్లో విద్యుద్దీకరణ పనులు మంజూరు చేయగా, 162 పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్నాయి. చాలా పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉండటానికి సిమెంట్ కొరత ప్రధాన కారణంగా తెలుస్తోంది.

డిజిటల్ విప్లవం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డిజిటల్ విప్లవానికి నాంది పలికారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు దృశ్య, శ్రవణ విధానంలో బోధనను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ అందజేశారు. 2022-23లో 14,561 మంది విద్యార్థులకు, 2,478 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్స్ అందజేశారు. 2023-24లో 13,340 మంది విద్యార్థులకు అందజేశారు. జిల్లాలోని 191 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 264 స్మార్ట్ టీవీలు, 142 ఉన్నత పాఠశాలలకు 951 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) 2022-23 విద్యా సంవత్సరంలో అందజేశారు. 2023-24లో 517 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 558 స్మార్ట్ టీవీలు, 197 ఉన్నత పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీ ప్యానల్స్ పంపిణీ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత విద్యా సంవత్సరంలో ట్యాబ్స్ అందజేయలేదు.



గత ప్రభుత్వంలో ట్యాబ్‌ల ద్వారా విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు



ఐఎఫ్‌పీతో బోధిస్తున్న ఉపాధ్యాయిని

ఎండీయూ ఆపరేటర్లను అవమానిస్తారా?



- ప్రభుత్వంలో భాగస్వాములైన వారిని ఉగ్రవాదులంటారా?
- జిల్లాకు మేలు చేసే ఒక్క ప్రకటనయినా చేశారా?
- చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ నేత జగ్గిరెడ్డి ఫైర్

సాక్షి, అమలాపురం: 'ఇంటింటా రేషన్ అందించే ఎండీయూ వాహనాల యజమానులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగ్రవాదులతో పోల్చడం దారుణం. ప్రభుత్వంతో కలిసి పని చేసేవారిని కించపరుస్తూ.. వ్యక్తిత్వ హననానికి గురి చేయడం దేశంలో మరే ముఖ్యమంత్రీ చేసిన చరిత్ర లేదు'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎండీయూ వాహనాల యజమానులకు న్యాయం చేయాలని కోర్టు మొట్టికాయ వేస్తే వారిని ఉగ్రవాదులతో పోల్చడం దారుణమని మండిపడ్డారు. సీఎంగా చంద్రబాబు వస్తే తమ బాధలకు పరిష్కారం చూపుతారని జిల్లావాసులు ఎంతో ఆశగా ఎదురు చూస్తే నిరాశకు గురి చేశారని అన్నారు. మహానాడులోనే కాదు.. కోనసీమలో కూడా చంద్రబాబు అబద్ధాలే మాట్లాడారని దుయ్యబట్టారు. 'జిల్లాలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో సొమ్ము ఇస్తామన్నారు. తరువాత 46 గంటల్లోనైనా చెల్లిస్తామని చెప్పారు. ఈ రోజుకు కూడా కూడా చెల్లించలేదు. ఇప్పటికీ రూ.కోట్ల బకాయిలున్నాయి. దీనిపై సీఎం హోదాలో చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడలేదు' అని విమర్శించారు. మహానాడులో అందరితో పొగిడించుకునే శ్రద్ధ జిల్లాలో రైతులపై లేకుండా పోయిందా అని ప్రశ్నించారు. మహిళలను చంద్రబాబు మోసం చేశారని, దఫదఫాలుగా గ్యాస్ ఉచితంగా అందిస్తామని చెప్పి, చివరకు గ్యాస్ కొట్టి వెళ్లారన్నారు. ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇస్తానని ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా దగా చేశారన్నారు. 'గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా గ్రూపులు తీసుకున్న రూ.26 వేల కోట్ల రుణాలను మాఫీ చేసి, ఆ లబ్ధిని మహిళలకు దఫదఫాలుగా అందించారు' అని గుర్తు చేశారు. నిరుద్యోగుల విషయంలో కూడా బాబు నోరు మెదపలేదని జగ్గిరెడ్డి అన్నారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి, ఉద్యోగాలు కల్పిస్తానన్నారని, ఆ పెట్టుబడుల సొమ్ము ఆయన ఎక్కడ దాచిపెట్టిందీ తెలియడం లేదని ఎద్దేవా చేశారు. నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో కూడా చెప్పలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6.14 లక్షల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి పదో తరగతి పరీక్షలు రాశారని, వాటి స్పాట్ వేల్యుయేషన్‌లో తీవ్ర తప్పిదాలు జరిగాయని, దీనికి చంద్రబాబు పుత్రరత్నం, విద్యా శాఖ మంత్రి లోకేష్ కారణం కాదా అని ప్రశ్నించారు. 'సఖినేటిపల్లికి చెందిన ఒక అమ్మాయికి సోషల్ సబ్జెక్టులో తొలుత 23 మార్కులు వచ్చాయి. రీ వెరిఫికేషన్‌కు వెళితే 84 మార్కులు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా 66 వేల మంది తల్లిదండ్రులు రీ వేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారంటే కూటమి ప్రభుత్వం వైఫల్యం, వ్యక్తిగతంగా లోకేష్ అసమర్థత కారణం' అని జగ్గిరెడ్డి మండిపడ్డారు. తప్పులకు కారకులైన అసలు వ్యక్తులను వదిలేసి, ఐదుగురు చిరుద్యోగులను సస్పెండ్ చేస్తే ప్రభుత్వ అసమర్థత ప్రజలకు తెలియకుండా పోదని అన్నారు. ఇసుక మీద చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఎవరైనా అక్రమాలు చేస్తే మీ వెనుక నా డ్రోన్ తిరుగుతోందని బాబు అంటున్నారని, కానీ మొన్న ముమ్మిడివరంలో ఎనిమిది మంది, పి.గన్నవరంలో ముగ్గురు పిల్లలు గోదావరి స్నానానికి వెళ్లి చనిపోవడానికి ఇసుక అక్రమ తవ్వకాలే కారణమని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇసుక అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. జిల్లాకు వచ్చిన చంద్రబాబు చనిపోయిన కుటుంబాలకు పరిహారం అందించకపోవడం దారుణమని జగ్గిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా..



వాడపల్లి క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి క్షేత్రానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు వాడపల్లి బాట పట్టారు. పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, భారీ క్యూ లైన్లలో బారులు తీరి, స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. అనేక మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించారు. శ్రీనివాసా.. శ్రీవేంకటేశా.. గోవిందా.. గోవిందా.. నామస్మరణతో క్షేత్రం మార్మోగింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో తెల్లవారుజామున ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యాన అర్చకులు, వేద పండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి స్వామివారికి వివిధ సేవలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం రంగురంగుల సుగంధభరిత పుష్పాలతో స్వామివారిని కన్నుల పండువగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈఓ చక్రధరరావు ఆధ్వర్యాన అధికారులు, సిబ్బంది భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం 5 గంటల వరకూ వేలాదిగా వచ్చిన భక్తుల విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, ఆన్‌లైన్, నిత్య, శాశ్వత అన్నదాన విరాళాలు, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా దేవస్థానానికి రూ.52,15,096 ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యాన ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము, వాడపల్లిలో ట్రాఫిక్ నియంత్రించి, శాంతిభద్రతలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లి ఆలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు నడిపింది.


పోగొట్టుకున్న ఉంగరం భక్తుడికి అందజేత



వాడపల్లి క్షేత్రంలో భక్తుడికి ఉంగరం అందజేస్తున్న ఆలయ జేఏ శ్రీను

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న క్షేత్రంలో ఒక భక్తుడు పోగొట్టుకున్న బంగారు ఉంగరాన్ని దేవస్థానం అధికారులు భద్రపరిచి ఆ భక్తునికి తిరిగి అప్పగించారు. ఈ క్షేత్రానికి ప్రతి శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ గత శనివారం విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన సుదర్శనరెడ్డి సుమారు రూ.లక్ష విలువ చేసే బంగారు ఉంగరం పోగొట్టుకున్నారు. తిరిగి ఇంటికి వెళ్లాక చూసుకుంటే ఉంగరం కనిపించలేదు. ఎక్కడో పడిపోయి ఉంటుందని భావించారు. అయితే ఆ ఉంగరం దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ వై.శ్రీనుకు దొరకగా ఆ విషయాన్ని దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు దృష్టికి తీసుకువెళ్లి ఆయన సూచనల మేరకు భద్రపరిచారు. కాగా ఈ శనివారం మళ్లీ వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఆ భక్తుడు సుదర్శనరెడ్డి దేవస్థానం వారిని సంప్రదించారు. ఆయన చెప్పిన ఆధారాలు పరిశీలించి, ఆ ఉంగరం ఆ భక్తునిదేనని నిర్ధారించుకుని శ్రీను చేతుల మీదుగానే ఆ ఉంగరాన్ని భక్తునికి తిరిగి అప్పగించారు. దానితో ఆ భక్తుని ఆనందానికి అవధులు లేవు. పోయిందనుకున్న ఉంగరం తిరిగి తనకు చేరడం ఆ వేంకటేశ్వరస్వామి కృపా కటాక్షమేనని అన్నారు. దేవస్థానం ఈఓ చక్రధరరావుకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం అన్నమాచార్య సంకీర్తనాచార్యులు కరుటూరి వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో భక్తజన కోలాహలం



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. అర్చకులు, వేద పండితులు తెల్లవారుజామున సుప్రభాత సేవ నిర్వహించారు. భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు తొలి హారతితో పాటు శ్రీదేవి, భూదేవీ సమేతుడైన బాల బాలాజీ స్వామిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారు స్వయంభువుగా వెలసిన పాత ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.4,03,024 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 5,800 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. స్వామి వారి అన్నప్రసాదం మూడు వేల మంది భక్తులు స్వీకరించారని తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.90,835 విరాళాలుగా అందించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రైతు ప్రాణం తీసిన కలుపు మందు


చెల్లు లీలాకృష్ణ ప్రసాద్ (ఫైల్)

నల్లజర్ల: పంట పొలాల్లో కలుపు నివారణకు వినియోగించే గడ్డి మందు ఓ యువ రైతు ప్రాణం తీసింది. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన యువ రైతు చెల్లు లీలాకృష్ణ ప్రసాద్ (30) పదిహేను రోజుల కిందట పొలాల్లో కలుపు నివారణకు ఇంటి వద్ద ఉన్న గడ్డి మందు డబ్బాను పొలానికి తీసుకెళ్లాడు. ఆ డబ్బాను బైక్ ముందు కవర్‌లో పెట్టాడు. మార్గ మధ్యంలో డబ్బా మూత లీకై అతని ప్యాంట్‌పై పడింది. ఏమీకాదులే అని కడిగేసుకుని ఆ మందు స్ప్రే చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఒక్కరోజు వ్యవధిలోనే ఒంటిపై పడిన మందు ద్రావణం వృషణాల నుంచి శరీరంలోని కిడ్నీ, లివర్ తదితర అవయవాలకు సోకింది. అతను తొలుత ఏలూరు, తర్వాత విజయవాడ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు మృతుడి తండ్రి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏడాది క్రితమే ప్రసాద్‌కు ఆవపాడుకు చెందిన మౌనికతో వివాహం కాగా, ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. ప్రసాద్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

అటవీ భూమిలో చెట్ల నరికివేత


కోమటికుంట అటవీ భూమిలో పట్టుకున్న ట్రాక్టర్

గోపాలపురం: మండలంలోని కోమటికుంట అటవీ భూమిలో ఉన్న చెట్లు నరికివేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రెండు ట్రాక్టర్ల పుల్లలను స్వాధీనం చేసుకున్నామని డీఆర్‌ఓ కె.వేణుగోపాల్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అటవీ శాఖకు చెందిన భూమిలో ఉన్న వేప, జీడిమామిడి చెట్లు అక్రమార్కులు నరుకుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. అక్కడ రెండు ట్రాక్టర్లతో ఉన్న సుమారు 12 టన్నుల పుల్లలను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ తెలిపారు.

అలా స్పాగిపోతున్నారు..!

- మసాజ్ పేరుతో మగువలతో వల
- రాజమహేంద్రవరంలో స్పా సెంటర్లు
- గుట్టుచప్పుడు కాకుండా హైటెక్ వ్యభిచారం
- దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం



రాజమహేంద్రవరంలో పోలీసులు దాడి చేసిన స్పా సెంటర్



ఓ సెంటర్‌లో ఆధునిక వసతులతో కూడిన గది

కంబాలచెరువు: (రాజమహేంద్రవరం): సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నయా సంస్కృతి మొదలైంది. ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు వంటి కాస్మోపాలిటన్ నగరాల్లో ఉండే స్పా సెంటర్ల కల్చర్ ఇక్కడకు విస్తరించింది. మసాజ్ పేరుతో హైటెక్ వ్యభిచారం అధికమైంది. ఉపాధి పేరుతో ఆయా స్పా సెంటర్లలో చేరిన యువతులను నిర్వాహకులు పడుపు వృత్తిలోకి దింపుతున్నారు. ఏడాది కాలంలో నగరంలో వ్యభిచారం నిర్వహిస్తున్న సుమారు 14 స్పా సెంటర్లపై పోలీసులు దాడులు చేసి పట్టుకోవడం చూస్తే.. జిల్లాలో చాపకింద నీరులా విష సంస్కృతి పెరిగిందని చెప్పకనే అర్థమవుతోంది.

ఎక్కడే ఎందుకంటే..

రాజమహేంద్రవరంలో ధనిక వర్గాలు ఎక్కువగా ఉండే ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డు, దానవాయిపేట వంటి ప్రాంతాల్లో ఇటీవల స్పా సెంటర్లు పెరుగుతున్నాయి. నిరుద్యోగ యువత ఉపాధి వేటలో భాగంగా బ్యూటీ కోర్సులు, మసాజ్ కోర్సులు వంటివి చేసి స్పా సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారం బాగుంటుండటంతో అసాంఘిక శక్తులు ఈ రంగంలోకి ప్రవేశించి పెట్టుబడి పెడుతూ తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు పథక రచన చేస్తున్నారు. బ్యూటీపార్లర్లతో కూడిన మసాజ్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే కస్టమర్లను వ్యభిచారం వైపు లాగుతున్నారు. ఆయా సెంటర్లకు వెళ్లే విటులలో ఎక్కువ వ్యాపార వర్గాలు, యువత ఉంటున్నారు. కొద్దినెలల కిందట ఏవీ అప్పారావు రోడ్డులో పట్టుబడిన స్పా సెంటర్ నిర్వాహకురాలు బ్యూటీ పార్లర్లకు వచ్చే మహిళలకు వారి అభిరుచి మేరకు మగ వ్యభిచారులను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఓ వాయిస్ రికార్డింగు బయటపడటం చూస్తే పరిస్థితి చేయిదాటిందని అర్థమవుతోంది. ఎక్కడో మెట్రోపాలిటన్ సిటీల్లో బయటపడే ఇటువంటి ఘటనలు జిల్లాలో విస్తరించడం చూస్తే అసాంఘిక శక్తులు ఏ మేరకు చొచ్చుకు వస్తున్నాయో స్పష్టమవుతోంది.

ఉద్యోగం పేరుతో..

బ్యూటీపార్లర్, సెలూన్, స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచారాలు ప్రారంభించే నిర్వాహకులు ముందుగా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి మసాజ్ సెంటర్లలో అనుభవం ఉన్న ఒకరిద్దరు యువతులను ఆకర్షణీయమైన ప్యాకేజీతో నియమించుకుంటారు. జన సంచారం తక్కువగా ఉండే ధనిక వర్గాలు నివసించే ప్రాంతాల్లో అట్టహాసంగా స్పా, సెలూన్ సెంటర్లు ప్రారంభించి రిసెప్షన్, హెల్పర్ల పేరుతో అందమైన యువతులను పనిలో పెట్టుకుంటారు. ముందే అనుభవం ఉన్న యువతులు కొత్తగా చేరిన వారితో సన్నిహితంగా ఉంటారు. వారికి ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తూ తమవైపు తిప్పుకుంటారు. వారి అవసరాలకు డబ్బులు ఇస్తూ పూర్తిగా వీరి ఉచ్చులో పడే విధంగా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటారు. కొత్తగా చేరిన యువతులకు పాత యువతులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తూ వారిని కూడా మసాజ్ ప్రక్రియకు ఉపయోగించుకుని కమీషన్ ఇస్తారు. నిర్వాహకులు ఆ యువతులతో చనువుగా ఉంటూ ఫోటోలు దిగడం చేస్తుంటారు. అవి నిర్వాహకుల వద్ద ఉండటంతో ఆ యువతులు పూర్తిగా విధేయతతో ఉంటారు. వారితో గొడవ పెట్టుకునేందుకు సాహసించరు. ఇలా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం సాగిపోతోంది.

హెయిర్ కటింగ్‌తో ప్రారంభమై..

ముందుగా హెయిర్ కటింగ్‌తో కస్టమర్లను ఆకర్షించే నిర్వాహకులు కస్టమర్లు అడగకపోయినా హెడ్ మసాజ్ వంటివి చేస్తారు. వారు చూపిస్తున్న ఆసక్తిని బట్టి తమ వద్ద బాడీ మసాజ్ కూడా ఉందని చెబుతారు. అలా ముగ్గులోకి వచ్చిన కస్టమర్లతో మసాజ్ ప్రక్రియలో భాగంగా పరిచయం పెంచుకుంటారు. చీకటి మాటున జరిగే ఈ మసాజ్ ప్రక్రియలో ఫుల్ మసాజ్, బాడీ టూ బాడీ మసాజ్ వంటి పేర్లతో యువతులతో మగ కస్టమర్లను ఆకర్షిస్తారు. ఇలా ప్రత్యేక గదిలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం కూడా జరిగిపోతుంది. అలవాటు పడిన కస్టమర్లు వారానికి ఒకసారైనా ఇక్కడకు వస్తున్నారని అంటున్నారు. ఇటీవల ఓ మసాజ్ సెంటర్ నిర్వాహకురాలి ఫోన్‌లో బ్యూటీపార్లర్‌కు వచ్చే ఆడవారికి మగ వ్యభిచారులను కూడా సమకూరుస్తున్నట్టు రికార్డింగ్ బయటపడటం విష సంస్కృతికి అద్దంపడుతోంది.

ఏడాదిలో 14 సెంటర్లపై దాడి



ఏడాది కాలంలో జిల్లాలోని రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో మసాజ్ సెంటర్లు, సెలూన్లు, బ్యూటీ పార్లర్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న 14 సెంటర్లపై పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. అక్కడ దొరికే యువతులను సాక్షులుగా పరిగణిస్తూ విటులపై, నిర్వాహకులపై కేసులు నమోదు చేశాం. స్పాలు, బ్యూటీపార్లర్లపై నిరంతరం నిఘా పెడుతున్నాం. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా సమాచారం ఇవ్వాలి.

–డి.నరసింహకిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

ఇసుక తవ్వకాలపై ఎన్‌జీటీకి సమాచారం


సూరెడ్డి శివకుమార్, మాజీ సైనికుడు

సీతానగరం: మండలంలోని సింగవరం ర్యాంపు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలపై చెన్నై, ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కు మెయిల్ ద్వారా సమాచా రం ఇచ్చానని వంగలపూడికి చెందిన మాజీ సైనికుడు, న్యాయ వాది సూరెడ్డి శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను అడ్డుకుని, వాటిని వీడియోలు, ఫొటోలు తీసి జిల్లా కలెక్టర్, ఏడీ మైన్స్, తహసీల్దార్, ఎస్సైలకు సామాజిక మాధ్య మాల ద్వారా తెలియపర్చానని తెలిపారు. దీంతో ఎస్సై స్పందించి లారీలను నిలిపివేశారని అన్నారు. శనివారం ఉదయం మైన్స్ ఏడీ నుంచి లిఖిత పూర్వక మెసేజ్ ఇచ్చారని, అందులో జిల్లా కలెక్టర్‌కు గాని, తనకు గాని సంబంధం లేదని తెలిపారన్నారు. అనకాపల్లి కలెక్టర్, మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు మాత్రమే సంబంధం ఉందని తెలియపర్చారని వివరించారు. జిల్లాలో తవ్వకాలపై వారికి సంబంధం లేదని అనడం హాస్యాస్పదంగా ఉందని, ఎన్జీటీకి తెలిపర్చిన తరువాత తనకు సమాచారం అందించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సింగవరం లంక భూముల్లో తవ్వకాలు జరపాల్సి ఉండగా, వంగలపూడి లంక భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి, సింగవరం ర్యాంపు నుంచి కాకుండా వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుక లారీలపై తరలిస్తున్నారని అన్నారు. సోమవారం గ్రామస్తులంతా లారీలను అడ్డుకుంటారని, అనకాపల్లి కలెక్టర్, ఏడీ మైన్స్ వారు వచ్చి పూర్తి వివరాలు తెలియజేసే వరకూ ఆ లారీలను అడ్డుకుంటామని శివకుమార్ హెచ్చరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ.పాత (ముక్కుడు) కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొత్త (పచ్చి) కాయ (వెయ్యి)	14,500- 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260



యోరక్కపోయారుగా..

- ఉద్యోగులకు యోగాంధ్ర పాట్లు
- జన సమీకరణకు ఆపసోపాలు
- వేలల్లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిళ్లు
- సచివాలయ సిబ్బందికి టార్గెట్లు


యోగా చేయిస్తున్న శిక్షకుడు

కాకినాడ సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది.. జూన్ 21వ తేదీకి అందరికీ యోగాపై సంపూర్ణ అవగాహన ఉండాలంటూ నెల రోజుల కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.. ఈ సందర్భంగా ప్రతి రోజూ గ్రామ, పట్టణ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. ప్రజలను భాగస్వామ్యం చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తోంది. దీంతో జిల్లాలో కార్పొరేషన్, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రహదారులపై యోగా చేయిస్తుంది. ర్యాలీలు చేపడుతుంది. మొత్తంగా జిల్లా అధికార యంత్రాంగం దాదాపు కొద్ది రోజులుగా ఇదే పనిలో ఉంటోంది. జూన్ 21వ తేదీ వరకూ ఇదే హడావుడి. మరి ఇవన్నీ చేయాలంటే మనుషులు ఉండాలి. అందుకోసం అందుబాటులో ఉన్న ఏ ఒక్కరినీ వదలడం లేదు. అంగన్‌వాడీలు, డ్వాక్రా మహిళలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్నారు. వీటిని పక్కాగా అమలు చేసేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలను నియమించారు. యోగాంధ్ర మినహా కొద్దిరోజులుగా మిగతా విషయాలను పక్కన పెట్టేశారు.

లెక్కల కోసం తిప్పలు

యోగా మాసంలో భాగంగా వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని పైనుంచి ఆదేశాలు వచ్చాయి. అంతేకాదు పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెబుతున్నారు. దీంతో లెక్కలు చూపించేందుకు జిల్లా అధికారులు అపసోపాలు పడుతున్నారు. పెద్దఎత్తున రిజిస్ట్రేషన్ చేయాలని సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించారు. దీనికోసం యోగా మంత్ యాప్‌ను సిద్ధం చేశారు. స్వచ్ఛందంగా ప్రజలెవరూ నమోదుకు ముందుకు రాకపోవడంతో సచివాలయ సిబ్బందే తమకు తెలిసిన వారి నంబర్లు సేకరించి, వారికి ఓటీపీలు ఇవ్వండంటూ బతిమలాడుతూ, రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇలా ఎందుకు ఓటీపీలు అడుగుతున్నారో కూడా చాలా మందికి తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతోనూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో సుమారు 10 లక్షల మందిని యోగాంధ్రలో భాగస్వాములు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రతి రోజూ ఉద్యోగులను ఆయా కార్యాలయాల్లో యోగా చేసినట్లు ఫొటోలు తీసి నెట్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలుండడంతో అధికారులు ఉద్యోగులను, ప్రజలను సమీకరించి యోగా కార్యక్రమాలు చేపట్టేందుకు వారికి తల ప్రాణం తోకకు వస్తుందని వాపోతున్నారు. గతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఏదో కార్యక్రమం చేపట్టేవారని, ఇలా నెల రోజులు నిర్వహించి, పెద్దఎత్తున నిధులు, సమయం వృథా చేయడం ఎన్నడూ లేదని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారులు సైతం మరోదారి లేక ఫొటోల కోసం మమ అనిపించేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



ఉయ్యూరువారి మెరకలో చెట్టు పైనే మృతి చెందిన నాని

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక గ్రామంలోని పైలాన్ సెంటర్లో శనివారం విద్యుత్ షాక్‌కు గురై దింపు కార్మికుడు బూసి నాని (28) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఒక రైతు పొలంలో నాని కొబ్బరి దింపు తీస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. చెట్టుకు సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైనుకు చేరిఉన్న కొబ్బరి ఆకును తొలగించే క్రమంలో ప్రమాదశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో మృతి చెందిన నాని చెట్టుపైనే మోకుతో వేలాడుతూ ఉండిపోయాడు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు


రాజానగరంలో ప్రమాదం జరిగిన ప్రాంతం


సత్యభాస్కరరావు (ఫైల్)

రాజానగరం: జాతీయ రహదారిపై రాజానగరం ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన బిక్కన సత్యభాస్కరరావు (69), అతని భార్య పాపాయమ్మతో కలసి స్కూటీపై పెద్దాపురం మండలం కట్టమూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా, వీరి వెనుక నుంచి వ్యాన్ వచ్చి ఢీకొంది. దీంతో సత్యభాస్కరరావు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్యకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం


రెడ్డి పైడారావు (ఫైల్)

బిక్కవోలు: పందలపాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన రెడ్డి పైడారావు (57) పనిపై తొస్సిపూడి వెళ్లి తిరిగి బైకుపై ఇంటి వస్తుండగా... తొస్సిపూడి సెంటర్‌లో గుడిమెట్ల శ్రీనివాస్‌రెడ్డిని వస్తున్నారు. పందలపాక కోదండరామా రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి, ధాన్యం ట్రాక్టర్ వేగంగా వెళ్తూ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న వీరు అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. దీంతో వారిని అనపర్తి సీహెచ్‌సీకి తరలించడంతో రెడ్డి పైడారావు మృతి చెందాడు. గుడిమెట్ల శ్రీనువాస్‌రెడ్డి గాయాలతో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. అందరితో సరదా ఉండే వ్యక్తి మృతితో విషాదచాయలు అల్లుకున్నాయి.

విద్యార్థినులకు స్టేట్ ర్యాంకులు


లిఖిత


బేగం

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు స్టేట్ ర్యాంకులు సాధించారు. వై.లిఖిత ఫస్ట్ ర్యాంకు, ఎండీవీజే బేగం 7వ ర్యాంకును పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. వారిని యాజమాన్యం అభినందించింది.

మాల మహానాడు జేఏసీ నాయకుల అరెస్ట్

పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలింపు


ముమ్మిడివరంలో గృహ నిర్బంధంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు మునికుమారి


కాట్రేనికోనలో గృహ నిర్బంధంలో జేఏసీ నాయకులు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం వచ్చిన సీఎం చంద్రబాబుకు ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరిగిందని తెలపాలని మాల మహానాడు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాల మహానాడు జేఏసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమలాపురం రూరల్, క్రైమ్ సీఐల ఆధ్వర్యంలో శనివారం ఉదయం బందరుపాలెం సమీపంలో కర్రివానిరేవుకు చెందిన జేఏసీ నాయకుడు కాశి జగపతిరావు, ఎదుర్లంక గ్రామానికి చెందిన దుక్కిపాటి సత్యనారాయణ, ముమ్మిడివరానికి చెందిన దేవరపల్లి ఏడుకొండలు, మెండి కృష్ణబాబు, ఉచ్చుల సాల్మన్‌రాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జేఏసీ నాయకులతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా నాయకురాలు కాశి బాలమునికుమారిని ముమ్మిడివరం బాలయోగి ఆశ్రమం వద్ద గృహ నిర్బంధం చేశారు.అలాగే కాట్రేనికోనకు చెందిన వడ్డి శ్యాంప్రసాద్, గల్లా రాజేందర్‌లను గృహ నిర్బంధం చేశారు. శనివారం రాత్రి ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌కు జేఏసీ నాయకులను తీసుకు వచ్చి అప్పగించారు.

పర్యాటకుల కోసం ప్రత్యేక రైళ్లు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఉత్తర భారత దేశంలో ప్రముఖ దేవాలయాలను సందర్శించుకునేలా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ హాలో సంయుక్త ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పర్యాటక రైళ్లను నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆయన మీడియా సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 14న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా సికింద్రాబాద్ నుంచి అయోధ్య కాశీ పుణ్యక్షేత్రాలు మీదుగా వారణాసి, ప్రయోగరాజ్, రామ జన్మభూమి, త్రివేణి సంగమం నైమిశా శరణ్యం సందర్శించుకోవచ్చన్నారు. 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ పర్యటన ఎకానమీ, స్టాండర్డ్, కంఫర్ట్ ప్యాకేజీల్లో ఉందన్నారు. ఈ రైలుకు విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని బోర్డింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి జూలై 5న పంచ జ్యోతిర్లింగ దర్శన్ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ప్రారంభమై అదే నెల 13న యాత్ర ముగుస్తుందన్నారు. నాగపూర్, ఉజ్జయిని, నాసిక్, పూణే ఔరంగాబాద్, డాక్టర్ అంబేద్కర్ జన్మస్థలం మహా పుణ్య స్థలాల సందర్శన ఉంటుందన్నారు. ఈ రైలుకు కామారెడ్డి, నిజామాబాద్, నాందేడు, పూర్ణ స్టేషన్లో బోర్డింగ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి లేహ్, లడఖ్, చారుదాం, గోవాలకు విమాన ప్యాకేజీలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సమావేశంలో ఐసీటీసీ అసిస్టెంట్ మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.